# స్పృహ

కామేశ్వర్రావు ఓరోజు ఆఫీసు డ్యూటీ మీదహఠాత్తుగా హైద్రాబాదువెళ్ళాల్సి వచ్చింది. ముందుగా తెలియనందున "రిజర్వేషన్" కుదరలేదు. అయినాసరే. పాయిఖానాలోనన్నా ప్రయాణించి పని పూర్తి చేసుకు రమ్మని బాసుదేవుని ఆజ్ఞ.

ఫాస్టు ఎక్స్‌ప్రెస్ పదినిమిషాల్లో వస్తుందనగా ప్లాట్‌ఫాంమీదకు పరిగెత్తుకొచ్చాడు కామేశ్వర్రావు.

పుట్ట పగిలినట్లు జనం.

"ఇంత రష్‌లో రిజర్వేషన్ సంగతి దేవుడెరుగు. జనరల్ కంపార్ట్‌మెంటులో నన్నా సీటు దొరుకుతుందా?" అని దిగులు పడుతున్న కామేశ్వర్రావుకు దేవుడిలా దర్శనమిచ్చాడు 'వాడు'.

ఆ 'వాడు' వక్కిలా వున్నాడు, అస్థిపంజరానికి తోలు అంటించినట్లు. "సీటు కావాలా సార్?"— సెల్సు అయిపోయిన రేడియోలాగా గొంతు గరగర మంటూంది.

"కావాలి. నువ్వెలా సంపాదిస్తావ్?" అనడిగాడు కామేశ్వర్రావు.

"ఆ సీక్రెట్ మీకెందుకు సార్? సీటు కావాలంటే పది రూపాయలిటు పారేయండి. బండి రాగానే దర్జాగా వెళ్ళి కూర్చోండి" అన్నాడు వాడు మిస్టీరియస్‌గా నవ్వుతూ.

కామేశ్వరరావు పది రూపాయలూ పారేశాడు. బండి రాగానే దర్జాగా వెళ్ళి కూర్చున్నాడు.

కామేశ్వర్రావులాగా ఇంకా పది మంది అలా సీట్లు సంపాదించేరు. అవకాశం లేనివాళ్ళు కొట్టుకు ఛస్తున్నారు.

బండి కదలటానికి ఇంకా పది నిమిషాలుంది. కామేశ్వరర్రావు బుర్రలో బ్రహ్మపదార్థం తళుక్కుమని మెరిసింది.



వాడిని దగ్గరికి పిలిచి మరో ఐదు రూపాయలు చేతిలోపెట్టి వివరాలు అడగటం మొదలుపెట్టాడు.

"నీవిలా సీట్లు ఎలా సంపాదిస్తావ్?"

"మాదంతా ఒక గ్రూప్ సార్. కొంత మంది బండి అవుటర్ సిగ్నల్‌దగ్గర "స్లో" ఐపోగానే ఎక్కేసి గుడ్డలు పరిచేస్తారు. ప్లాట్‌ఫాంమీదకు రాగానే మీబోటివాళ్ళకు అమ్ముకుంటాం."

"పెట్టుబడిలేని వ్యాపారమన్నమాట. రోజుకెంత సంపాదిస్తారు?"

"రమారమి వందదాకా వుంటుందిసార్. స్టేషనోళ్ళకి సగం పోతుంది. మిగతా సగం మేమంతా పంచుకోవాలి. అయినా ఈ విషయాలన్నీ ఎందుకుసార్ అడుగుతున్నారు?" అన్నాడు వాడు.

"కథ రాయటానికోయ్. మీబోటివాళ్ళను గురించి రాస్తేనే ఇప్పుడు మంచి విలువ. ఇదివరకోసారి ఇలాగే కుష్టుపిల్లను గురించి రాస్తే వెయ్యి రూపాయలు బహుమతి వచ్చింది. అయినా మీరిలా చేయటం తప్పు కదూ! ప్రజలకోసం ప్రభుత్వం నడిపే రైళ్ళలో అక్రమంగా సీట్లు సంపాదించి అమ్ముకోవటం తప్పుకదూ?" అన్నాడు కామేశ్వర్రావు సీటులో సర్దుకు కూర్చుంటూ.

రైలుబండి పెద్దగా కూసింది.

వాడు వెంటనే ఒకే ఒక్కమాటనేశాడు- "మరేంచేయమంటారు సార్! మీలాగా కథలు రాసి అమ్ముకోటానికి చదువులేదుగా. అందుకే ఇట్లా సీట్లమ్ముకొంటున్నాం...."

"సామాజిక స్పృహ" సంగతటుంచి కామేశ్వర్రావుకు స్పృహ పోయినంత పనయింది. ●

కర్లపాలెం హనుమంతరావు

---

# ఏదను ధర్మము



టైము ఏడౌతూంది.

చక్రధరరావ్ ఒక్కసారి వాచీ చూసుకొని తన ముందున్న క్యూని చూసి "ప్చ్— ఇవేళ కూడా లాభం లేదు. స్వామి వార్ని దర్శించి గీత వినే యోగం నాకు లేదు కాబోలు" అని ఒక్క క్షణం ఆలోచనల్లో పడి తిరిగి చకచకా రోగులను ప్రశ్నిస్తూ వాళ్ళ కళ్ళను పరీక్షిస్తూ అందుకనుగుణంగా తన పక్కనున్న పాత్రలోని మందును వాళ్ళకిస్తున్నాడు.

చక్రధరరావ్ వాళ్ళ కుటుంబం "పచ్చ కామెర్ల"కు ఇచ్చే మందువల్ల ఆ ఊళ్ళోనే కాకుండా ఆ చుట్టుప్రక్కల ఐదారు వందల మైళ్ళ దూరంవరకు ప్రసిద్ధిగాంచింది. అన్ని చోట్లా ఆశలువదులుకున్నవారు వీళ్ళ ఇంటి ముందు పడిగాపులు కాచేవారు. తండ్రి చనిపోయిన దగ్గర్నుంచీ అంటే దాదాపుగా పదిహేనేళ్ళనుంచి చక్రధరరావ్ ఆ కార్యక్రమాన్నినిర్విరామంగా నిర్వహిస్తున్నాడు. దాదాపు అతని టైమంతా మందుకు కావల్సిన మూలికలను సంపాదించడం, వాటిని నూరి నిల్వచేయడం, రోగులను పరీక్షించి మందు ఇవ్వడంలోనే గడిచిపోతోంది

ఈ పనివల్ల అతనికొచ్చే లాభమేమీలేకపోగా బోల్డు ఖర్చు. ఆస్థిపాస్తులుండటం వలన అతనికేమీ ఇబ్బంది కల్గలేదు కానీ అతనికే ఈ మధ్య విసుగు పుడ్తూంది. అతని వయస్సు కూడా 40 ని చేరుకుంది. అందరిలా తను జీవించలేకపోతున్నందుకూ, పిల్లా పాపలతో సరదాగా కాలక్షేపం చేయలేక పోతున్నందుకూ, పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ గుళ్ళకు వెళ్తూ భక్తి మార్గంలో కాలం గడపలేనందుకూ అతనిలో నైరాశ్యం పెరిగిపోతోంది.

ఈమధ్య ఊళ్ళోకి వచ్చిన స్వాముల వారి 'గీత' ఉపన్యాసాలు అత్యద్భుతంగా ఉన్నాయని అందరూ అనుకుంటుంటే అక్కడకు వెళ్ళాలనుకున్నాడు. కానీ అందుకు టైమే చిక్కడంలేదు. అందుకనే ఆ రోజు మనస్సు మరీ ఉదాసీనంగా ఉంది.

ఎంతో ప్రయత్నంమీద, చక్రధరరావ్ ఆ రాత్రికి స్వామివారి దగ్గరకు వెళ్ళాడు.

కుశలప్రశ్నలూ, మర్యాదలూ అయినాక ఎవ్వరూలేని సమయంలో తన మనస్సులోని గోడంతా వెళ్ళబోసుకున్నాడు స్వామివారి ముందు.

స్వామివారు ఒక్కక్షణం ఆలోచించి ఒక చిన్న కాగితంమీద ఏదోరాసి "ఇంటికి వెళ్ళి ప్రశాంత చిత్తంతో చదువుకో. నీ సమస్యకు సమాధానం బోధపడ్తుంది"అన్నారు.

ఆ రాత్రి చక్రధరరావ్ చీటీ తీసి

"కాలవాహిని అలల వాలున
కదిలిపోవుట సులభతరమే
ఎదను ధర్మము మెదలుచుండగ
ఎదురు యీదుట పరమ కఠినము
ప్రతిన బూనుట ఇలను సులభము
సఫలతా సంప్రాప్తి కఠినము"

అని చదివి చిర్నవ్వుతో అర్థమయినట్టుగా తల పంకించి, సున్నితంగా తన కర్తవ్యాన్ని బోధించిన స్వామివారికి వందనాలర్పించి పడక గదికి చేరుకున్నాడు.

—ప్రభు

---




వసంతకి స్టీలు సామాను అంటే తగని పిచ్చి. పాతబట్ట లేసి ఎప్పుడూ ఏదో ఒక గిన్నో, చెంబో, పళ్ళెమో కొంటూ వుండేది. ఇంటికి కావలసినవన్నీ కొన్నది కానీ, స్టీలు డ్రమ్ మాత్రం కొనటం పడలేదు. స్టీలు సామాన్లవాడు ఏదో వంక పెట్టి బేరం కుదరనిచ్చేవాడు కాదు. ఎలాగయినా మీడియమ్ సైజు డ్రమ్ కొనాలని ఆమె తాపత్రయం. డ్రమ్ కోసం, పాత పట్టుచీరలు కూడా పాత బట్టల మూటలో చేర్చింది. అప్పటికి నాలుగు నెలలబట్టీ పోగుచేస్తోంది. ఎలాగయినా, ఈసారి పైన డబ్బులేసి అయినాసరే డ్రమ్ కొనాలని ఆవిడ పట్టుదల.

భర్తకి భోజనంపెట్టి పంపింది. తనుకూడా భోజనంచేసింది. ప్రక్కవాటావాళ్ళు సెలవలకి ఊరెళ్ళడంతో, ఏంతోచక ఏదో పుస్తకం పట్టుకుని మంచంమీద వాలింది. కథ సగం చదువుతుండగానే "స్టీలు సామాన్లోయ్....స్టీ....లు సామా....న్లోయ్", అని కేకేసాడు రోడ్డుమీద స్టీలు సామాన్లవాడు. గబగబా పుస్తకం మంచంమీద పడేసి, కిటికీ దగ్గరకొచ్చి చూసింది. వాడి బుట్టలో స్టీలు డ్రమ్ మీడియమ్‌సైజుది. ఇంకా చాలా సామాన్లున్నయ్. డ్రమ్ముని చూడగానే లాటరీ తగిలినట్టు సంతోషపడ్డది. గబగబా తలుపుతీసి స్టీలు సామాన్లవాడిని పిలిచింది.

లోపలికెళ్ళి పెద్ద బట్టలమూటని తెచ్చి వాడిముందు పడేసింది. "ఇవిగో ఇవీ బట్టలు" అంటూ బట్టలు చూపించింది. వాడు బట్టల్ని ఒకసారి చూసి "ఇదుగో నండమ్మా ఈ గిన్నె వస్తుంది." అంటూ చిన్న గిన్నె చూపించాడు.

"ఇంకా నయం! ఈ బట్టలకి ఆ స్పూను వస్తుంది అన్నావు గాదు! మేమేం ఈ వూరికి కొత్తనుకుంటున్నావా!? నీవే కొత్తలాగున్నావ్. ఇన్ని కొన్నా సామాన్లు" అంటూ ఏకబిగిన చేతులూపింది.

"సరే కానీయండమ్మా, ఇదిగో ఈ బేసి నొస్తుంది. అంతకంటే రాదమ్మా. పోనీ ఇంకా రెండు జరీచీరలేయండమ్మా" అన్నాడు.

"సరే ఇంకో చీర వేస్తాను గాని, ఆ డ్రమ్ ఇస్తావా?"

"అమ్మో! డ్రమ్మే! ఈ గుడ్డలకా? రాదండమ్మగారు. అయినా ఇయెందుకండీ. దృతరాష్టుని కొడుకుల్లాగా! పాండవుల్లా ఒక స్టెచ్చిలాన్ పేంచేయండి" అన్నాడు తనకు తెలిసిన పాండిత్యం వెలగబెడుతూ.

"సరేకానీ, ఇంకో చీర ఇస్తాను. తక్కువైతే పదో ఐదో డబ్బులిస్తాను. ఆ డ్రమ్ కావాలి" అంటూ ఆ బుట్టమీదికి వంగి చిన్న చిన్న సామాన్లు బయటికి తీసి, మెల్లిగా డ్రమ్ తీయటానికి ప్రయత్నిస్తోంది. అలా వంగడంలో ఆవిడ పుస్తెల గొలుసు ముందుకు జారి, ఆవిడ మెడకి వేలాడినట్లు ఊగసాగింది.

"చెప్పానుగదండీ రాదని. మీరు ఆ చీర లేసినా, పైన ఏభై రూపాయలివ్వాలిసి వస్తారు" అంటూ ఆ ఊగుతున్న గొలుసు వంకే చూడసాగాడు. అది ఆవిడ గమనించలేదు. వాడికి ఆవిడ చేసే స్టీలు సామాన్ల చప్పుడు ఏమీ వినిపించట్లేదు. వాడు ఆ గొలుసువేపే చూస్తున్నాడు. అది అప్పుడే చేయించినట్లు మిలమిలా మెరుస్తోంది పుస్తెలు కూడా కొత్తవిలాగే ఉన్నాయి. వాడికి ఎట్లాగయినా ఆ గొలుసు కాజేయాలనిపించింది. 'ఈ బుట్ట నెత్తిన పెట్టుకుని ఎన్నాళ్ళు ఇలా తిరగటం, ఈ గొలుసు కొట్టేస్తే హాయిగా బ్రతకొచ్చు' అని వాడికి దుర్బుద్ధి పుట్టిందేమో, వాడు అలాగే ఒకసారి గొలుసు వేపు చూశాడు. అది అలా ఊగుతూనే వుంది ఆవిడ ప్రతి కదలికకి.

వాడు మెల్లిగా ఆ గొలుసుని ఒడుపుగా పట్టుకుని ఒక్క లాగు లాగాడు. అంతే గొలుసుకి పుస్తెలకి మధ్య దారం బాగా మెత్తబడినట్లు, అది వాడి చేతిలోకి ఈజీగానే వచ్చింది. ఒక్కసారి ఆవిడ ఆ అనుకోని సంఘటనకి బెదిరిపోయింది. మాటలు తడబడ్డాయి.

"గొ....గొ....గొలుసు. నా గొలుసు" అంటూ నత్తిగా అరుస్తుండగానే వాడు అప్పటికే కాంపౌండ్ దాటాడు. "పట్టుకోండి, గొలుసు తీసుకుపోతున్నాడు, పట్టుకోండి" అంటూ ఆమె కంఠం ఆమెకే వినిపించనట్లు అరుస్తోంది. మిట్టమధ్యాహ్నం. ఎండ దంచుతోంది. ఆ వేళప్పుడు బయటికి ఎవరొస్తారు! రోడ్డుమీద ఒక్క పురుగు లేదు. వాడు రన్నింగ్‌లో "డిస్టింక్షన్" పుచ్చుకున్న వాడిలా యమస్పీడుగా పరిగెట్టాడు. అలా సందు చివరిదాకా వాణ్ని చూస్తూ నిల్చుంది. అంతకన్న ఏం చేయగలదు, రోడ్డుకి అడ్డంబడి పరిగెత్తుతుందా ఏం!

వణుకుతున్న చేతులతో ముందుహాల్లో వాడు ఉన్నపళాన వదిలేసిపోయిన బుట్టని మెల్లిగా ప్రక్కరూమ్‌లోకి లాగింది. బుట్ట చిందరవందరగా వుంది. నేలమీద కొంత సామాను పడేసి వుంది. మెల్లిగా అన్నీ తీసి బుట్టలో వేసింది. వాడు నెత్తిమీద గుడ్డ కూడా వదిలేసిపోయాడు — ద్రాష్టుడు. బుట్టనిండా సామాను. డిష్‌లూ, చిన్నవి పెద్దవి గిన్నెలు, గ్లాసులు, పళ్ళాలు. అన్నీ ఒక్కొక్కటి డబుల్స్. ట్రిబుల్స్‌-కళ్ళు తిరిగినయి. నీరసంగా వణుకుతున్న చేతులతో తలుపేసింది.

సాయంత్రం భర్త ఆఫీసునుంచి వచ్చాడు. వసంత ఫుల్ మేకప్‌లో ఉంది. ఆశ్చర్యపోయాడు. "ఇవాళ జీతాలిచ్చేరోజు కాదే, మరి ఏదయినా సినిమాకా? ఎందుకబ్బా?" అని అనుకుంటూ ప్రక్కరూంలో ఉన్న బుట్టెడు స్టీలు సామాన్లు చూసి ఆశ్చర్యపోయి, "వసంతా ఇన్ని సామాన్లెక్కడివి? మధ్యాహ్నం కొన్నావా?"

"అబ్బే లేదండీ! ఊరికినే తీసుకున్నా" అంటూ జరిగినదంతా చెప్పి నవ్వింది. "మొన్న బజారెళ్ళినప్పుడు దొంగలభయంగా ఉందని ఒక రోల్డుగోల్డు పుస్తెల గొలుసు కొన్నా! మూడు రోజులబట్టి వేసుకుంటున్నా! వాడు అది బంగారపు దనుకొని మోసపోయాడు. బుట్ట బుట్టా వదిలేసి చక్కాపోయాడు" అంటూ పడీపడీ నవ్వసాగింది.

"అంటే ముప్పయి రూపాలయతో మూడొందలు ఖరీదుచేసే డ్రమ్ము, ఇంకా చిన్నవి పెద్దవి సామానంతా కొట్టేశావన్న మాట! అదృష్టమంటే నీదేనోయ్. భలే ఛాన్స్ కొట్టావ్" అన్నాడు భర్త మహేష్.

లలిత